పెంచడం ఎంతో గొప్ప విషయం. అందులో భర్తని గౌరవించడం మరీ గొప్ప విషయం. అందరి స్త్రీకి ఆదర్శప్రాయమైన విషయం కూడా.

## భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభలు

జనవరి 27 వ తేదీ నించి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ విజయవాడ భవానీ సేన్‌నగర్‌లో దిగ్విజయంగా జరిగాయి. ఈ మహాసభలకు దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి 1560 మంది ప్రతినిధులు, 30 విదేశాల నుంచి సౌహార్ద్ర ప్రతినిధులు వచ్చారు. ప్రత్యేకించి భారత విప్లవదశను గురించిన అంచనాల్లో ఇది జాతీయ ప్రజాతంత్ర విప్లవదశ అనీ, కాంగ్రెస్‌లోని అతివాద ప్రజాతంత్ర భావాలు కలిగిన వారితో సహా, వామపక్ష ప్రజాతంత్ర పార్టీలను, శక్తులను, వ్యక్తులను కూడగట్టుకు రావాలని — సామ్రాజ్యవాదుల నుండి, దేశంలో మితవాద అభివృద్ధినిరోధక శక్తుల నుండి భారత దేశం ఎదుర్కొంటున్న ప్రమాదాన్నుండి దేశాన్ని కాపాడాలని — ఈ సభల్లో తీర్మానించారు. రెండవ తేదీన బ్రహ్మాండమైన ఊరేగింపు, బహిరంగ సభ జరిగాయి.

---

స్కెచ్

# మామూలు మనిషి

— కొంపెల్ల విశ్వం

బాబ్జీ ఇచ్చిన టెలిగ్రాం అది -

“ఫాదర్ ఎక్స్‌పైర్డు” అని వుంది అందులో. రెండురోజుల క్రితం ఇచ్చిన టెలిగ్రాం అది. బాబ్జీ కళ్యాణరావు తమ్ముడు.

అంత దుఃఖంలోనూ ట్రెయిన్ కోసం సిద్ధపడుతున్నాడు కళ్యాణరావు. అంతలోనే మరొక టెలిగ్రాం -

అదీ బాబ్జీ ఇచ్చిందే. “ఫాదర్ సీరియస్. స్టార్టు ఇమ్మీడియెట్లీ.” మూడు రోజుల క్రితం ఇచ్చిన టెలిగ్రామది.

“టెలిగ్రాములు చాలా త్వరితగతి చేరుతున్నాయనటానికింతకన్నా నిదర్శన మేం కావాలి?” ఒళ్ళు మండిపోయింది కళ్యాణరావుకి.

సరే —

ఇంట్లోంచి ఎలాగో బైట పడ్డాడు. తమ్ముడున్న ఊరు పోవాలంటే రెండు బస్సులు మారి వెళ్ళాలి. ట్రెయినయితే సరాసరి వాళ్ళ ఊరిలోనే దిగిపోవచ్చును.

రైల్వే స్టేషనుకే పోవాలనుకున్నాడు కళ్యాణరావు. పది నిముషాలు చూసినా. ఒక్క ఆటో కూడ దొరకలేదు. కాదు. కనపళ్లేదు.

ఎవరో చెప్పారు—

ఒక ఆటో రిక్షా డ్రైవరును స్టూడెంటెవరో కొట్టార్ట. ఆ స్టూడెంటుని మరో నలుగురు ఆటోవాళ్ళు గట్టిగా తన్నారట దాంతో స్టూడెంట్స్ విజృంభించి యువతరం తాలూకు శక్తినంతా ఆటోలపై చూపిస్తున్నారట.

సో—

ఆటోలు నడవటం లేదు. సానుభూతిగా టాక్సీలూ లేవు.

'బాగానే వుంది వెధవగొడవ' సణు

కుక్కున్నాడు కళ్యాణరావు.

'పోనీ రిక్షా....'

స్టూడెంట్స్ అంతా కలసి కాలేజీలు మానేసి వూరేగటానికి రిక్షాలు ఎంగేజ్ చేశారు.

'వీళ్ళలాటి వెర్రిమొర్రి పంతాలకు పోకుండా జాతీయ సమస్యలవైపు చూపు మళ్ళిస్తే ఎంత బాగుంటుంది'? గొణుక్కున్నాడు కళ్యాణరావు.

ఇక సిటీబస్సే శరణ్యం.

ఇరవై నిమిషాలు గడిచాక, దొరికించుకున్నాడు కళ్యాణరావు బస్సుని. సగం దూరంవెళ్ళి పది నిమిషాలు ఆగిపోయింది బస్సు.

కారణం – ట్రాఫిక్ సిగ్నల్స్‌కాదు, స్టూడెంట్స్ ప్రొసెషన్.

వాహనాలేవీ లేవేమో అసలే రద్దీగా వుందిబస్సు.దానికితోడుఊరేగింపువదిలి, బస్సులోకి చొరబడ్డారు కొంతమంది. ఇక చూడాలి అవస్థ.

కాసేపు ప్రయాణించి మళ్లా ఆగింది బస్సు.కాదు ఆపారు బస్సుని–మొబైల్ కోర్టు వాళ్ళు.

ఆ తతంగం–ఓ ఇరవై నిముషాలు.

"టిక్కెట్లు తిసుకునేడవకూడదూ వీళ్లూ" పైకే విసుక్కున్నాడు కళ్యాణరావు.

"సర్లెండి వాళ్ళు టిక్కెట్లు తీసుకుంటే ఈ మొబైల్‌కోర్టు లెందుకు? అసలు దేశంలో ఇంత అన్యాయం, అక్రమం జరగటానికి కారణం మీకు తెలుసా సార్ ?" ఎవడో మొదలెట్టాడు ఖర్చులేని ఉపన్యాసానికి ఉపోద్ఘాతం.

'చచ్చాం వీణ్ణి నవసరంగా కదిలించినట్టున్నాను' అనుకుని కాస్త దూరంగా జరిగినట్టు జరిగి వూపుకున్నాడు కళ్యాణరావు

మొత్తానికి రైల్వే స్టేషనొచ్చింది.

"ఏం లేవు సార్!" ఎంక్వయిరీలో కళ్యాణరావు ప్రశ్నకది జవాబు.

"మరి సమ్మె అయినా, అన్ని రైళ్ళు సకాలంలో కాకపోయినా వెడుతూనే వున్నాయి – అని పేపర్లో వేస్తున్నారు కదండీ!" అమాయకుడిలాగ అడిగాడు కళ్యాణరావు. అతని ఆతృత అలాటిది!

"అవును వేస్తున్నారు. రైళ్లు సకాలంలో వెళ్ళకపోతే జరిగే అనర్థాలను ఏకరువు పెడుతున్నారు, రేడియోలో వినలేదాండీ! దానికేమంటారు?" అన్నారెవరో.

దేవుడు కనిపించినంత పనైంది. ఎవరో రైల్వే అధికారి కనిపించేసరికి అడిగాడు కళ్యాణరావు"నేనేంచేయాలి?" అని.?

"అయ్యా! మిమ్మల్ని చేరవేయటానికి పూనుకుంటే మీ ప్రాణాలు, మా రైళ్లు కూడ పోయే పరిస్థితిది. మీరు మరో మార్గం చూసుకోవటం మంచిది" అని వెళ్ళిపోయాడతను.

"ఈ సమ్మెలు చేసేవాళ్ళూ, చేయించేవాళ్ళూ, వీనిపట్ల ఉదాసీనత చూపించేవాళ్ళూ–అంతా బాగానే వున్నారు. కానీ, తిట్టుకుంటూ బస్సుడిపో కెళ్ళటానికి మళ్ళీ సిటీబస్సు కోసం నించున్నాడు కళ్యాణరావు. అంతకన్నా అతనేం చేస్తాడు? ఏంచేయగలడు??

ఆఫ్టరాల్, అతనొక మామూలు మనిషి. ●